ఆడపడుచులకు 'ఆసరా'

- మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం
- నియోజకవర్గంలో 5.444 డ్వాక్రా గ్రూపులకు రూ.201.89 కోట్ల సాయం

పెదపూడి: ప్రభుత్వం ఆడపడుచులకు అండగా నిలబడింది. మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తూ అనేక సంక్షేమ పథకాలను అందిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పథకం లబ్ధి మహిళల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా జగనన్న ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది. చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మాయ మాటలు చెప్పిందే తప్ప ఆచరణలో చూపలేదు. దీంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. చెప్పినట్టుగానే అధికారంలోకి రాగానే మహిళలు తీసుకున్న రుణాలను ప్రభుత్వమే నాలుగు దఫాలుగా చెల్లించింది.

నియోజకవర్గంలో

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, పెదపూడి రంగంపేట, బిక్కవోలు మండలాలు ఉన్నాయి. వీటిలో సుమారు 5,444 డ్వాక్రా సంఘాల ఉన్నాయి. ఆ సంఘాల్లో ఉన్న మహిళలకు సుమారు రూ.201.89 కోట్ల మేర వైఎస్సార్ ఆసరా నిధులు మంజూరయ్యాయి. ఆయా మండలాల్లో నాలుగు విడతల్లో మహిళ సంఘాలకు వైఎస్సార్ ఆసరాలో అందిన లబ్ధి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

మండలం	డ్వాక్రా గ్రూపులు	లబ్ధి(రూ.కోట్లలో)
అనపర్తి	1310	48.34
బిక్కవోలు	1525	57.56
రంగంపేట	1170	37.18
పెదపూడి	1439	58.81
మొత్తం	5,444	201.89



శహపురం గ్రామంలో వైఎస్సార్ ఆసరా విడుదల సందర్భంగా సీఎం జగన్, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు(ఫైల్)

ఎంతో ఆనందంగా ఉంది



అన్న మాట ప్రకారం డ్వాక్రా సంఘాలకు ముఖ్యమంత్రి జగన్ రుణమాఫీ చేశారు. చాలా ఆనందంగా ఉంది. వైఎస్సార్ ఆసరా రుణమాఫీ నాలుగు విడతల్లో మొత్తంగా రూ.61 వేలు జమైంది. ఈ ఆసరా నిధులతో ఇంట్లో ఐస్‌క్రీమ్ వ్యాపారం చేసుకుంటున్నాను. కుటుంబానికి అండగా ఉంటూ వ్యాపారం చేసి జీవనం సాగిస్తున్నాను. నా భర్త వ్యవసాయం చేస్తుంటాడు. నా కొడుకు 8వ తరగతి చదువుతున్నాడు. అమ్మ ఒడి పథకం కూడా వచ్చింది.

–కె.గంగాభవాని, డ్వాక్రా మహిళ, ఉదయ జ్యోతి గ్రూప్, పెద్దాడ గ్రామం

రుణపడి ఉంటాం



డ్వాక్రా మహిళలకు ఆసరాగా రుణమాఫీ చేయడంతో పాటు మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. నాలుగో విడతల్లో సుమారు రూ.30 వేలు అందుకున్నాను. ఆ నగదుతో ఫినాయిల్ తయారు చేసే వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను.

–సీహెచ్ సాయి గంగ, వేంద్ర గ్రామం, మానస డ్వాక్రా సంఘం

పశు పెంపకంపై యువతకు శిక్షణ



పొట్టి మేకల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే అధికారులు

రాజానగరం: పశువులను ఆరోగ్యంగా, సురక్షితంగా చూసుకుంటే పాల ఉత్పత్తి కూడా ఎంతో వృద్ధి చెందుతుందని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. ఎంపిక చేసిన గ్రామీణ యువతకు పశు పోషణ, యాజమాన్య నైపుణ్యాలు, పశువులకు సోకే రోగాలకు ప్రాథమికంగా చేపట్టాల్సిన చికిత్సలపై కేవీకేలో వారం రోజులు నిర్వహించే శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ నాయుడు మాట్లాడుతూ పశు పోషణకు అవసరమైన పశుగ్రాసం, దాని వల్ల చేకూరే ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. ఆత్మ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.జ్యోతిర్మయి మాట్లాడుతూ గ్రామీణ యువతకు శిక్షణతో పాటు ఉపాధిని చూపేందుకు కేవీకే చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కేవీకే విశ్రాంత పశువైద్యాధికారులు డాక్టర్ జాన్‌బాబు, డాక్టర్ పీవీవీఎస్ శివరావు మాట్లాడుతూ పశువులకు అందించే ప్రథమ చికిత్స, టీకాలు, వాటి వలన పశువులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. పశువులలో రోగ నిరోధక శక్తిని ఏ విధంగా పెంచాలో తెలియజేశారు. అనంతరం కేకేవీలోని పొట్టి మేకలు, కోళ్ల పెంపకం యూనిట్లను, పశు గ్రాసం క్షేత్రాలను శిక్షణకు హాజరైన యువత సందర్శించింది. కార్యక్రమంలో టి.విజయవర్ధన్, జె.ప్రభాత్ నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎన్నికల ప్రచారం



కొండగుంటూరులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాజా

రాజానగరం: మండలంలోని కొండగుంటూరు, తోకాడ గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీకి చెందిన నేతలను, కార్యకర్తలతో కలిసి ప్రతి ఒక్కరితో మాట్లాడారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి తోడ్పడాలని కోరారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఆయనకు ప్రజలు అభిమానంతో హారతులు ఇచ్చారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు శనివారం వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్‌తేజ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా హాజరవుతారన్నారు.

ముగిసిన ఏడు వారాల వ్రతాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

పెదపూడి: సంపర వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మాఘమాసంలో ప్రారంభమైన ఏడు శనివారాల వ్రతం పూజలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఉచిత విద్య దరఖాస్తులకు గడువు పెంపు

రంగంపేట: ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్టు మండల విద్యాశాఖాధికారి-1 కోసు శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి గాను అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల్లోని పేద పిల్లలకు కేటాయించాలని విద్యాశాఖ నుంచి గతంలోనే ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మొదట మార్చి 14 వరకూ మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఇవ్వగా తాజాగా సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఈ గడువును ఈ నెల 31 వరకూ పొడిగించారన్నారు.

వైద్య శిబిరం



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధి నాగరత్నం కాలనీలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.సుధామయి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు, రఘుదేవపురానికి చెందిన శ్రీమామయ్య హాస్పటల్ అధినేత డాక్టర్ సత్యం రమేష్‌బాబు శిబిరంలో వైద్యసేవలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పోషకాహారం, సరైన నిద్ర, వ్యాయామం, విద్య ఆదాయం, సరైన జీవన విధానాల గురించి అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.హరే రామకృష్ణ, కామర్స్ అధ్యాపకుడు షేక్ దర్గా మదీనా తదితరులు మాట్లాడారు. అనంతరం డాక్టర్లు రాజు, సత్యం రమేష్‌బాబు, హెల్త్ సూపర్ వైజర్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ హరేరామకృష్ణ, కామర్స్ లెక్చరర్ మదీనాలను సన్మానించారు.

ఏరువాక శాస్త్రవేత్తల కృషి అభినందనీయం



డాక్టర్ విజయానందన్‌ను సత్కరిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

రాజానగరం: జిల్లాలో వ్యవసాయ రంగం అభివృద్ధికి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు చల్లా వెంకటనరసింహరావు, పి.అమ్మాజీ, ఎస్.హేమజ్యోతి చేసిన కృషి అభినందనీయమని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.విజయానందన్ అన్నారు. దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రాన్ని శనివారం సందర్శించిన ఆయన కేంద్రం పనితీరును ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయనను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సత్కరించి, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో మార్టేరు పరిశోధన స్థానం అధిపతి డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సంక్షేమం, అభివృద్ధి



రంగాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి

బిక్కవోలు: వైఎస్సార్ సీపీ పభుత్వంలోనే సంక్షేమం, అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో శనివారం ఆమె ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో మహిళలు ఇంటింటా ఆమెకు మంగళ హారతులు పడుతూ అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు సేవకులుగా ఉంటూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ అవినీతికి తావు లేకుండా అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పాటు మహిళలకు అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, రైతులకు రైతు భరోసా, విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు అందించడంతో పాటు ప్రతి గ్రామానికీ మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. అందుకే ప్రజలంతా మళ్లీ వైఎస్సార్ సీపీకి ఓటేసి, వైఎస్ జగన్‌మోహనరెడ్డిని ముఖ్యమంత్రిగా, డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గండికోట వీరభద్రరావు, ఉపసర్పంచ్ కొమారపు శాంతికుమారి, కొంకుదురు సర్పంచ్ సత్తి వీరమణి, మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, ముప్పిడి మురళీకృష్ణ, నడింపల్లి వాసురాజు, కేతా అప్పన్నబాబు, పార్టీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓటు విలువను గుర్తించాలి



బిక్కవోలులో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ నంద కిషోర్

బిక్కవోలు: భారత పౌరులంతా ఓటు విలువను గుర్తించి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని ఆర్ఐ నందకిషోర్ సూచించారు. శనివారం స్థానిక నెహ్రూ కేంద్రం ఆధ్వర్యంలో బిక్కవోలు ప్రజ్ఞ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నంద కిషోర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర వలంటీర్ మణికంఠ రామకృష్ణారెడ్డి, కళాశాల సెక్రటరీ ఓదూరి శ్రీను, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.గోవిందరాజు, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ కృష్ణారెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జగన్ సంక్షేమ పాలనకు మద్దతు పలకండి

- సీలింగ్ ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి
- రామచంద్రపురంలో డాక్టర్ రాజశ్రీ ఎన్నికల ప్రచారం



రామచంద్రపురంలో ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ రాజశ్రీ

సీతానగరం: రానున్న ఎన్నికలలో సీలింగ్ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, సంక్షేమ పాలనకు మద్దతు పలకాలని ప్రజలను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ కోరారు. పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, వైస్ ఎంపీపీ -2 సత్యం మదన్‌బాబు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను, చల్లమళ్ల సుజీరాజు, గద్దె వీరన్నబాబు తదితరులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, ప్రజలందరి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. రాజానగరాన్ని నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా మహిళలకు బొట్టు పెట్టి వారిత మమేకమవుతూ ముందుకు సాగారు. రాష్ట్రంలో మళ్లీ రాజన్న రాజ్యం రావాలంటే మేలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొండిపాటి కోటేశ్వరరావు, జొన్నలగడ్డ గంగరాజు, ఉండవల్లి ప్రభాకరరావు, తీగిరెడ్డి రామకృష్ణ, గురజా రవి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, పెందుర్తి భారతి, ఉండవల్లి యశోదా రాణి, అట్రు పద్మావతి, జొన్నలగడ్డ లక్ష్మి, మారిన స్వాతి, గారపాటి గంగాభవానీ, రంధి భారతీదేవి పాల్గొన్నారు.

రబీ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ డి.సునీల్‌బాబు

అనపర్తి: వచ్చే నెల 9వ తేదీ నుంచి రబీ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ డి.సునీల్ బాబు తెలిపారు. రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధించి అధికారులు శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రైసు మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్ బాబు మాట్లాడుతూ మండల పరిధిలో చేపట్టిన రబీ సాగుకు అనుగుణంగా ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని కోరారు. మండల వ్యవసాయాధికారి డి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో 9,200 ఎకరాల్లో రైతులు రబీ సాగు చేపట్టారన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గన్నీ బ్యాగ్స్ సిద్ధం చేస్తున్నామని, హమాలీ, రవాణా సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీటీ ఎన్.డారకయ్య, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

భక్తులకు భోజన వసతి

మధురపూడి: కోరుకొండలోని విరియాల వెంకటరెడ్డి పంతులు సత్రం దాతృత్వానికి చిరునామాగా నిలిచిందని ఈఓ పాటి సత్యనారాయణ తెలిపారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా ఐదు రోజులూ భక్తులకు మధ్యాహ్నం, రాత్రి భోజనం వితరణ చేస్తున్నామన్నారు. కోటికేశవరం గ్రామానికి చెందిన విరియాల వెంకటరెడ్డి 1918లో దీనిని నెలకొల్పారు. ఈ సత్రానికి ప్రస్తుతం 123.56 ఎకరాలు స్థిరాస్తి ఉంది.

వైభవంగా రంగనాథస్వామి కల్యాణం

మధురపూడి: కోరుకొండ అగ్రహారంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామివారి కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ నేపథ్యంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం సమీపంలోని ఈ ఆలయానికి భక్తుల రద్దీ ఏర్పడింది. నరసింహస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజు బట్టర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. తొలుత గోదాదేవి, రంగనాథస్వామికి మంగళ స్నానాలు చేయించారు. పట్టువస్త్రాలను అలంకరించి కల్యాణ మహోత్సవం జరిపారు. పాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యులు, పెద్దింటి చంటిబాబు, పెదపాటి నరసింహ గిరిధర్, గోవర్ధనం తిరుమలాచార్యులు చేతుల మీదుగా కల్యాణం జరిగింది. పెదపాటి, పెద్దింటి, పెరవలి కుటుంబాలకు చెందిన అర్చక స్వాములు, భక్తులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్‌రెడ్డి, కేతినీడి అశోక్, బొండాడ చందు పాల్గొన్నారు.

విప్లవ వీరులకు నివాళి



భగత్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నాయకులు



బిక్కవోలులో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మికులు

రాజానగరం: స్థానిక అఖిల భారత రైతు కూలీ సంఘం కార్యాలయంలో శనివారం విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. రైతు సమన్వయ కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ చిత్రపటానికి రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు పూలమాలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఈ వీరులు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. సంఘం డివిజన్ నాయకురాలు మరుకుర్తి వీరలక్ష్మి, తామరల గౌరీ, నక్కా లక్ష్మి, గున్నూరు అరవాలమ్మ, తోటకూర బేబి పాల్గొన్నారు.

విప్లవ వీరుడు భగత్‌సింగ్

బిక్కవోలు: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన విప్లవ వీరుడు భగత్‌సింగ్ అని బహుజన్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు కరుపోతు నవీన్‌కుమార్ అన్నారు. శనివారం బిక్కవోలులో భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రసాద్, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, మంగ, లక్ష్మి, శివశంకర్, పారిశుద్ధ్య, రిక్షా కార్మికులు, ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు



ఇన్నీసుపేట పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులను ముందస్తుగా సిద్ధం చేసుకుని నివేదిక అందజేయాలని బీఎల్‌వోలను రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ ఆదేశించారు. ఆయన శనివారం ఇన్నీసుపేటలోని 155, టి.నగర్ హిందూసమాజ్ భవనంలోని 142 పోలింగ్ స్టేషన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఓ తేజ్ భరత్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించే క్రమంలో పోలింగ్ స్టేషన్లలో అన్ని ఏర్పాట్లను ముందస్తుగా సిద్ధం చేస్తున్నామన్నారు. పోలింగ్ స్టేషన్‌లో వివరాలు స్పష్టంగా కనిపించేలా బూత్ స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెం జిల్లా ప్లానింగ్ అధికారి కోటయ్య, బీఎల్‌వోలు ఈ.సౌజన్య, కె.రంజిత్ కుమార్ ఉన్నారు.

శ్రీలక్ష్మి హ్యుందాయ్ ఎక్స్ఛేంజ్, లోన్‌మేళా



జ్యోతి ప్రజ్వలన చేసి మేళాను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక జేఎన్ రోడ్డులోని ఐరన్ హిల్‌కు ఎదురుగా ఉన్న మైదానంలో శనివారం శ్రీలక్ష్మీ హ్యుందాయ్ ఆధ్వర్యంలో మెగా ఎక్స్ఛేంజ్, లోన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ (క్రెడిట్) కోరంగి శ్రీనివాసరావు ప్రారంభించారు. లక్ష్మీ హ్యుందాయ్ రాజమండ్రి గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎక్స్ఛేంజ్, లోన్‌మేళాలో భారీ డిస్కౌంట్‌తో పాటు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తున్నామన్నారు. కొత్త కారు కొనుగోలుకు రూ.2 లక్షల వరకూ డిస్కౌంట్ ఉందన్నారు. ఈ మేళాలో కొత్త కారు బుక్కింగ్ చేసిన ప్రతి కస్టమర్‌కు 2 గ్రాముల బంగారం కాయిన్ అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి పాత కారు వాల్యుయేషన్‌కు, కొత్త కారు టెస్ట్ డ్రైవ్‌కు కూడా బహుమతులు ఉన్నాయన్నారు. ఉచిత సర్వీస్ చెకప్, వాటర్ వాష్ కూపన్లు కూడా అందిస్తున్నామన్నారు. ఇవికాక స్పాట్ ఫైనాన్స్ కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఎక్స్ఛేంజ్, లోన్‌మేళా ఆదివారం కూడా కొనసాగుతుందని, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పది పరీక్షా కేంద్రాల్లో తనిఖీ



పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పరీక్షల పరిశీలకులు డి.మధుసూదన్‌రావు

అనపర్తి: మండల పరిధిలో ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా పరీక్షల పరిశీలకులు డి.మధుసూదన్‌రావు శనివారం తనిఖీ చేశారు. మండలంలోని కుతుకులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, అనపర్తిలోని జెడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాల, జీబీఆర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఇదిలావుండగా శనివారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్షలకు మండల పరిధిలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 921 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో సీసీ వర్ధన్, మండల విద్యాశాఖాధికారి నల్లమిల్లి సత్తిరెడ్డి, కె.సత్తిరెడ్డి, జయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షకు 27 మంది గైర్హాజరు

రంగంపేట: మండలంలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం జరిగిన పదో తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్షకు 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యా శాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదో రోజు పరీక్షకు మూడు కేంద్రాల్లోను మొత్తం 654 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 627 మంది మాత్రమే పరీక్ష రాశారన్నారు.

ఘనంగా సోమాలమ్మ జాతర



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రకాశం నగర్: శ్యామల నగర్ పుంత రోడ్డులోని పాత సోమాలమ్మ జాతరలో భాగంగా అమ్మవారిని శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరను ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్, ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈనెల 20న ప్రారంభమైన జాతర ఆదివారం (24వ తేదీ) ముగుస్తుంది. ఆఖరి రోజు భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. కార్యక్రమంలో అడపా అనిల్, ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో ఆదిరెడ్డి వాసు అరాచకాలు



భరత్‌రామ్, ఎంపీ

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో వ్యాపారులకు ఇబ్బంది కలిగేలా కార్పొరేషన్ అధికారులతో కలిసి బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు అరాచకాలు చేస్తున్నారని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ దేవీచౌక్, దానవాయిపేట, ఏకేసీ కళాశాల, ఆదిత్య కళాశాల, వీటీ కళాశాల రోడ్లలో దుకాణాల ముందు ఉన్న మెట్లు, శ్లాబ్‌లను నాలుగు రోజులుగా తొలగిస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇది ఆదిరెడ్డి అప్పారావు కుటుంబం చేస్తున్న రాజకీయ కుట్రలో భాగమేనన్నారు. నాలుగున్నరేళ్లగా ఎప్పుడూ లేని ఈ పనిని ఇప్పుడు ఎందుకు మున్సిపల్ అధికారులు చేయిస్తున్నారో వ్యాపారులు, వ్యాపార సంస్థ నిర్వాహకులు గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. ఆదిరెడ్డి వీరరాఘవమ్మ మేయర్‌గా ఉన్నప్పట్నుంచీ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కొందరు అధికారులు పాతుకుపోయి ఉన్నారన్నారు. వారి ఆధ్వర్యంలో ఆదిరెడ్డి కుటుంబం ఈ పనులు చేయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఎంపీగా ఉన్న తనపై తప్పుడు ప్రచారం, బురద జల్లేందుకు ఇప్పుడు ఇటువంటి కూల్చివేత కార్యక్రమాలు ప్రారంభించారన్నారు. ఈ కుట్రలను వ్యాపారులు గ్రహించాలని కోరారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత ఇటువంటి చర్యలు చేపట్టడం సమంజసం కాదని, ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళతానన్నారు. వ్యాపారులకు నష్టం కలిగించే విధంగా ఎటువంటి చర్యలూ ఎంపీగా ఎప్పుడూ తీసుకోలేదని, భవిష్యత్తులో కూడా తీసుకోనని ఎంపీ భరత్‌రామ్ స్పష్టం చేశారు.